## రైతు హితమే సిఎం కెసిఆర్ ధ్యేయం : ఎఎంసి చైర్మన్

**తొగుట, మే 10, ప్రభాతవార్త :** రైతు హితమే సిఎం కెసిఆర్ ధ్యేయమని ఎఎంసి చైర్మన్ దోమల కొమురయ్య అన్నారు. మండల పరిధిలోని లింగంపేటలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మంగ రేణుక నర్సింలుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర అందించడానికే ప్రభుత్వం గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. మండలంలోని 17 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని రైతులు అధైర్యపడొద్దన్నారు. అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు అందిస్తుందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షులు బోదనం కనకయ్య, ఉప సర్పంచ్ సుదర్శనం, సొసైటీ, ఎఎంసి డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, అమీర్, నాయకులు గొడుగు ఐలయ్య, మంగ యాదగిరి, కర్ణాకర్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త


## 15 నుంచి మండలంలో చీఫ్ మినిస్టర్ టోర్నమెంట్

**బెజ్జంకి, మే 10, ప్రభాతవార్త:** ఈనెల 15 నుంచి 17 వరకు మండల కేంద్రంలో చీఫ్ మినిస్టర్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎంపిపి లింగాల నిర్మల అన్నారు. బుధవారం చీఫ్ మినిస్టర్ టోర్నమెంట్ నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈనెల 15 నుంచి స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా 15 యేండ్ల నుంచి 36 యేండ్ల కలిగి వివిధ క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువత, యువకులు టీమ్ సభ్యులు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ టోర్నీలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయి క్రీడా పోటీలు ముగిసిన అనంతరం ఎంపికైనా జట్లను జిల్లా స్థాయిలో 22 నుంచి 24 వరకు జరిగే క్రీడల్లో పాల్గొనేందుకు పంపడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైనా క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో 28 నుంచి 31 వరకు జరిగే క్రీడ పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. మండల క్రీడల కమిటీ నిర్వహణ కన్వీనర్‌గా ఎంపిడిఓ దమ్మని రాము, కమిటీ సభ్యులుగా ఎస్ఐ ప్రవీణ్‌రాజు, ఆర్ఐ రాజయ్య తదితరులు వ్యవహరించనున్నారు.



అంత్రిక్ సురక్ష సేవా పథకం అందుకుంటున్న ధరణికుమార్

## ధరణికుమార్‌కు అంత్రిక్ సురక్ష సేవా పథకం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని సిఏఆర్ హెడ్ క్వార్టర్‌లో వెల్ఫేర్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ధరణికుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అంత్రిక్ సురక్ష సేవా పథకంకు ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ రవీంద్రభారతిలో బుధవారం హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, డిజిపి అంజనీకుమార్ చేతుల మీదుగా అంత్రిక్ సురక్ష సేవా పకథం, అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్‌చంద్రబోస్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌లు కేంద్ర ప్రభుత్వ సేవా పథకం అందుకున్న ధరణికుమార్‌ను అభినందించారు. అనంతరం సీపీ శ్వేత మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో నీతి నిజాయితీగా విధులు నిర్వహించే అధికారులను, సిబ్బందిని గుర్తించి రివార్డులు, అవార్డులు, ఉత్తమ సేవా పథకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

## తనకు న్యాయం చేయండి

### కెనాల్‌లో భూమి కోల్పోయిన రైతు ఆవేదన



విలేకరులతో గోడు చెప్పుకుంటున్న రైతు యాదగిరి

**వర్గల్, మే 10 (ప్రభాతవార్త):** కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు సంగారెడ్డి కెనాల్ కోసం గౌరారం గ్రామానికి చెందిన రైతు కుమ్మరి యాదగిరికి సంబంధించిన సర్వే నెం.35ఇ1 లో ఒక ఎకరా 26 గుంటల 75 గజాల పట్టా భూమిలో నుండి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు 31 గుంటల భూమిని సేకరించారు. అయితే ఇప్పటి వరకు ఐదేళ్ళు గడుస్తున్నా నష్టపరిహారం ఇవ్వలేదని, మిగిలిన భూమిని తమ పేరుపై ఎక్కించడం లేదని రైతు యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు యాదగిరి, అతని భార్య పెంటమ్మలు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వద్దన్నా వినకుండా అన్యాయంగా, అక్రమంగా తమ జీవనాధారమైన వ్యవసాయ భూమిని సేకరించారని విచారం వ్యక్తం చేశారు. 31 గుంటలు సేకరించాల్సిన భూమికి బదులు నిర్లక్ష్యంతో సరైన లెక్కలు వేయకుండా ఒక ఎకరా 26 గుంటల భూమిలో నుండి 2 గుంటలు మినహా పూర్తిగా రికార్డుల్లో కనిపించకుండా అధికారులు బ్లాక్ చేశారని విచారం వ్యక్తం చేశారు. మా భూమి పూర్తిగా పోదని, కెనాల్‌కు పక్కన ఉంటుందని సరిగ్గా కొలిచి భూమిని సేకరించాలని ఎంత బ్రతిమాలినా మిగిలిన భూమి తర్వాత మీ పేరుపై రికార్డుల్లో ఎక్కిస్తామని చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారని తెలిపారు. పొరపాటున అవసరానికి మించి భూమి సేకరించారని ముందు నుండి తాము చెప్పినా అధికారులు వినలేదని, ఇదే విషయం అధికారులకు చెప్పి నష్టపరిహారం చెక్కు కూడా తీసుకోలేదన్నారు. కెనాల్ పూర్తయ్యాక మళ్ళీ రీ సర్వే చేయించి ఎంత భూమి పోయిందో అంత భూమికి నష్టపరిహారం చెల్లించి మిగిలిన భూమిని తమ పేరుపై ఎక్కించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి 31 గుం టలు పోతుందని తేల్చి చెప్పినట్లు పేర్కొన్నారు. ఆరు సంవత్సరాలు గడుస్తున్నా 31 గుంటలకు సంబంధించి నష్టపరిహారం చెల్లించడం లేదని, మిగిలిన భూమిని రికార్డుల్లో తమ పేరున ఎక్కించడం లేదన్నారు. రికార్డుల్లో తమ పేరున లేకపోవడంతో రైతుబంధు, కేంద్రం సహాయం అందక నష్టపోయామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తమకు నష్టపరిహారం అందించి తమ భూమిని తమ పేరుపై రికార్డుల్లో నమోదు చేయాలని వారు కోరుతున్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**కొల్చారం, మే10 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కొల్చారం పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కన్నెబోయిన ఏగొండ (35) గత రెండేళ్లుగా సాగు చేసిన పంటలో సరైన దిగుబడులు రాక పట పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో కుటుం బంలో తరచూ గొడవుల జరిగేవి. దీంతో మనస్తాపం చెందిన ఏగొండ తెల్లవారు జామున గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రేణుక, కుమారుడు మహేష్, కూతురు శ్రీనిత ఉనన్నట్లు తెలిపారు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకొని శివాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ సర్పంచి చలం ఝాన్సీలక్ష్మీ యాదగిరి, గ్రామస్థులు కోరుతున్నారు.

## మంత్రి పదవిని కాపాడుకోవడం కోసం విమర్శలు

### -పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్

**గజ్వేల్, మే 10 (ప్రభాతవార్త):** మంత్రి పదవిని కాపాడుకోవడం కోసం తలసాని శ్రీనివాస్‌యాదవ్ కాంగ్రెస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ ఆరోపించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంత్రి శ్రీనివాస్‌యాదవ్ కెసిఆర్ మెప్పు పొందాలనే ఆలోచనతో బానిసగా మారి మతి భ్రమించి కాంగ్రెస్ నేతలను విమర్శిస్తున్నారని ఆరోపించారు. మంత్రి తలసాని అహంకారపూరిత మాటలను మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను వాడు వీడు, పిసుకుతా అంటూ ఏకవచనంతో మాట్లాడడం అనైతికమన్నారు. మంత్రి పదవి కోసం ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలో బానిసలా బ్రతకడం ఆయనకు అలవాటైందన్నారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోరాటం చేస్తే వారికి అండగా నిలిచిన కాంగ్రెస్ నేతలను మంత్రి శ్రీనివాస్‌యాదవ్ విమర్శించడం సరైందికాదని హెచ్చరించారు.

# రైతులకు ఎరువులు సిద్ధంగా ఉంచాలి

### కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, మే10 ప్రభాతవార్త:** రాబోవు వర్షాకాలంలో పంటలకు అవసరమైన సరిపడా ఎరువులను ముందస్తుగానే ప్రణాళిక వేసుకొని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయుటకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా వ్యవసాయ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వచ్చే వర్షాకాలానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలకు సరిపడా ఎరువుల సరఫరా కోసం ముందస్తు ఏర్పాట్లపై వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్, ఆగ్రోస్, ప్రాథమిక సహాకర సంఘం అధికారులు, ప్రైవేటు ఎరువుల సరఫరా దారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వానాకాలంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోసీ, ఎస్ఎస్‌పీ వంటి రసాయన ఎరువులు 96,340 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేయడం జరిగిందని అన్నారు. కాగా రైతులకు ఎరువుల కొరత రాకుండా మే నుండి సెప్టెంబర్ వరకు నిర్దేశించుకన్న లక్ష్యానికి అదనంగా పది శాతం స్టాక్‌తో ఎరువులు సరఫరా చేయుటకు సంస్థలు సిద్ధంగా ఉండాలన్నారు. ఎరువులను కేవలం పీవోఎస్ మిషన్ ద్వారా మాత్రమే ఎంఆర్‌పీ ధరలకు లోబడి విక్రయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైల్వే మార్గం ద్వారా మెదక్, తిమ్మాపూర్, గజ్వేల్, సనత్‌నగర్, కామారెడ్డి రాక్ పాయింట్‌ల నుండి వచ్చే ఎరువులను భద్రపరుచుటకు గోదాములను సిద్ధంగా ఉంచుకోవాలని, రామాయంపేటలో వేయి టన్నుల సామర్థ్యం గల గోదామును సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారులకు సూచించారు. వచ్చే ఎరువుల్లో 40 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు, 40 శాతం ప్రైవేట్ డీలర్లకు, 20 శాతం 37 ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేయాలన్నారు. జిల్లాలో పాక్స్, డీసీఎంఎస్, ఏఆర్ఎస్‌కే, హక్కా, రైతు ఉత్పత్తి సంఘాలు, హోల్‌సేల్, రిటైల్ ఎరువుల డీలర్లు మొత్తం 259 ఉన్నాయని, వారంతా ప్రతి నెలా డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు సరఫరా చేసేవిధంగా స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం ప్రాథమిక సహాకార సంఘాలు, ఎరువుల దుకాణాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేస్తూ ఎరువల చట్టం ప్రకారం నిబంధనలను పాటిస్తూ ఎరువులను ముందుస్తుగా నిల్వ ఉంచుకొని రైతులకు సకాలంలో అందించేలా పర్యవేక్షించాలన్నారు. ఫర్టిలైజర్ మానిటరింగ్ సిస్టంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, తద్వారా స్టాక్ వివరాలతో పాటు ఇంకా కావలసిన ఎరువుల తాజా పరిస్థితి తెలుస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆశా కుమారి, జిల్లా సహకార అధికారి కరుణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ క్రాంతి, ఆగ్రో రైతు సేవా కేంద్రం, హక, ప్రాతమిక సహకార సంగాల చైర్మన్లు, సీఈవోలు, వివిధ డివిజన్లకు సంబంధించిన సహాయ వ్యవసాయ సంచాలకులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉండాలి పాల్గొన్నారు.

# ఈ యేడు సైతం టెన్త్‌లో అదే స్ఫూర్తి

### వరుసగా నాలుగు సార్లు పదిలో అగ్రస్థానం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** టెన్త్ ఫలితాల్లో ఈ యేడు సైతం సిద్దిపేట జిల్లా విద్యార్థులు అదే స్ఫూర్తిని కొనసాగించారు. గత యేడాది రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన సిద్దిపేట జిల్లా బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన టెన్త్ ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచింది. గత యేడాది 97.85 శాతం ఉత్తీర్ణత సాధిస్తే ఈ యేడు ఉత్తీర్ణత శాతం 98.65 శాతంకు పెరిగింది. గత యేడాది కంటే 1.4 శాతం ఉత్తీర్ణత శాతం పెరిగింది. జిల్లాలో 14, 177 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13, 985 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురలలో 7,053 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6,927 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే బాలికలు 7,124 మంది పరీక్షలు రాయగా 7,058 ఉత్తీర్ణత సాధించారు. మంత్రి తన్నీరు హరీష్‌రావు నిరంతర పర్యవేక్షణలో జిల్లా మరో సారి రాష్ట్రంలో టెన్త్ ఫలితాల్లో అదర్శంగా నిలిచింది. విద్యార్థులకు డిజిటల్ తరగతులు, ప్రత్యేక తరగతులు, స్నాక్స్, తల్లిదండ్రులకు ఉత్తరం అలాగే కాన్ఫరెన్స్ ద్వారా నింపిన అత్మవిశాస్వం, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడంతో పదిలో పదిలింగా నిలిచారు.

అంతకు ముందు 2,3వ స్థానాల్లో, గత యేడాది మొదటి స్థానంలో ఈ యేడు రెండో స్థానంలో నిలిచింది. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు 10 వేల నగదు, వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలకు రూ.25 వేల నగదు పురస్కారం అందిస్తానని ఇప్పటికే మంత్రి హరీష్‌రావు ప్రకటించారు. జిల్లాలో 126 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా 219 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. 8 మండలాలు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మంత్రి హరీష్‌రావు ఇచ్చిన మాట ప్రకారం 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.25 వేల నగదు, వంద శాత ం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు రూ. 10 వేల నగదు జూన్ నెలలో అందజేయనున్నారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని ఎప్పుడు కొనసాగించాలన్నారు

# ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలు

### బికెఎమ్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సృజన్‌కుమార్

**అక్కన్నపేట, మే10, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకై పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. బుధవారం రోజున మండలంలోని బొడిగపల్లి, గోవర్ధనగిరి, గౌరవెల్లి గ్రామాల్లో తమ సిపిఐ పార్టీ నాయకులతో కలసి ఈనెల 15వ తేదీన హుస్నాబాద్‌లో తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఇందుకు సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించే సభకు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావ్, సిని నటుడు ఆర్ నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్‌లు హాజరవుతారన్నారు. ఈ మహాసభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జేరిపోతుల జనార్ధన్, నాయకులు రాజు, శ్రీనివాస్, రాజయ్య, సుధాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### బహిరంగ సభను విజయవంతం చేయండి

ఈ నెల15న హుస్నాబాద్ లో నిర్వహించనున్న సిపిఐ పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్ పిలుపునిచ్చారు. బుధవారం రోజున హుస్నాబాద్ మండలంలోని నాగారం, ఉమ్మాపూర్, మహ్మదాపూర్ గ్రామాలలో బహిరంగ సభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో పార్టీ నాయకులు అయిలేని సంజీవరెడ్డి, ఎగ్గోజు సుదర్శన చారి, లక్ష్మి, పద్మ, రాజ్‌కుమార్, స్వప్న, స్వాతి, కిష్టయ్య, ప్రసాద్, కనుకయ్య, కుమారస్వామి, మొగిలయ్య, సుధాకర్, రవిందర్, లక్ష్మి, శశిరేఖ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సృజన్‌కుమార్

### విద్యార్థిని అభినందించిన సిపిఐ నాయకులు

మంగళవారం రోజున విడుదలైన ఇంటర్ మీడియట్ ఫలితాలో హుస్నాబాద్ పట్టణానికి చెందిన గుంటిపల్లి అశ్విత జిల్లా మొదటి ర్యాంక్‌తో పాటు రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్ సాధించిన సందర్భంగా బుధవారం రోజున సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్ తమ పార్టీ నాయకులతో కలసి విద్యార్థిని అశ్వితను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి సంజీవరెడ్డి, నాయకులు స్వప్న, లక్ష్మి, సుదర్శనచారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఖతం చేస్తారా?

### మెదక్ ఎమ్మెల్యే వర్గీయులకు బెదిరింపు ఫోన్లు... మైనంపల్లి వర్గీయులపై అనుమానం.. పోలీసు ఠాణాలో ఫిర్యాదు

**పాపన్నపేట, మే 10, ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వర్గీయులకు ఖతం చేస్తామని బెదిరింపు ఫోన్లు వస్తున్నాయి. బెదిరింపులకు పాల్పడుతున్నది మైనంపల్లి రోహిత్ వర్గీయుల పనే అని అనుమానం వ్యక్తం చేస్తూ బుధవారం పోలీసు ఠాణాలో ఎమ్మెల్యే వర్గీయులు సర్పంచులు ఫిర్యాదు చేశారు. మండలంలోని కుర్తివాడ సర్పంచ్ స్రవంతి భర్త శ్రీనివాస్, మెదక్ మార్కెట్ కమిటి డైరెక్టర్ సాప సాయిలు లు ఇటీవల సోషల్ మీడియాలో ఎమ్మెల్యేకు సంబంధించి ఫోటోలు పోస్టు చేశారు. సోషల్ మీడియాలో చేసిన పోస్టులకు గుర్తు తెలియని వ్యక్తులు సాయిలు, శ్రీనివాస్‌లకు ఫోన్ చేసి బెదిరించడమే కాకుండా సర్పంచ్ భర్త శ్రీనివాస్‌తో ఓ మహిళ అసభ్యకరంగా ఆరోపణలు చేసిందని శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. తనను ఇరకాటంలో పెట్టేలా మహిళ మాట్లాడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

### మైనంపల్లి రోహిత్ వర్గీయులే బెదిరించారు : నేతలు

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డికి అనుకూలంగా సోషల్ మీడియా, వాట్సాఫ్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నామని మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌కు చెందిన వారు తమను బెదిరిస్తున్నారని శ్రీనివాస్‌తో పాటు పలువురు బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అర్ధరాత్రి మహిళలతో ఫోన్లు చేయిస్తూ బెదిరిస్తూ అంత మొందిస్తామని, అసభ్య పదజాలంతో దూషిస్తూ గుర్తు తెలియని నంబర్లతో ఫోన్ చేస్తున్నారని ఆరోపించారు. బెదిరింపు కాల్‌కు కారణం మైనంపల్లి రోహిత్ ఉండి చేయిస్తున్నారని ఆరోపించారు. మెదక్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఇలాంటి బెదిరింపులకు ఎవరూ పాల్పడలేదని, ఇటీవలే ఇలాంటి ఫోన్‌లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెదిరింపు కాల్స్ చేసిన, చేయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాపన్నపేట సొసైటీ డైరెక్టర్ గడీల శ్రీనివాస్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జగన్, స్థానిక సర్పంచ్ గురుమూర్తిగౌడ్, సర్పంచ్‌లు లింగారెడ్డి, మల్లేశం, బుజ్జమ్మ ఆశయ్య, ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు కేబేర్, మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి వెంకటేశం, శ్రీనివాస్‌రావు, బాలాగౌడ్ తదితరులు ఉన్నారు.



పోలీసుకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే అనుచరుల దృశ్యం

## సిద్దిపేట డెంటిస్ట్‌కు అరుదైన గుర్తింపు

### సౌత్ ఆఫ్రికా మెడికల్ హెల్త్ సైన్స్

### యూనివర్శిటీ ఆఫ్ రువాండా నుంచి పిలుపు

### దేశం తరపున పాల్గొననున్న సిద్దిపేట వైద్యుడు

**సిద్దిపేట రూరల్, మే 10, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ డెంటల్ అసుపత్రి డాక్టర్ అరవింద్ కుమార్‌కు అరుదైన గుర్తింపు లభించింది. సౌత్‌ఆఫ్రికాలోని స్కూల్ అఫ్ డెంటిస్ట్ కాలేజీ అఫ్ మెడిసిన్ అండ్ హెల్త్ సైన్స్ యూనివర్శిటీ అఫ్ రువాండా ప్రిన్సిపాల్, ప్రొ॥ అబ్రహం హెచ్ ఎ మిటికె ఎండి. ఈ మేరకు బ్యాచిలర్ అఫ్ డెంటల్ సర్జరీకి సంబంధించిన ఫైనల్ పరీక్షలో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ నిర్వహణకు డాక్టర్ అరవింద్‌కుమార్‌కు అహ్వానం పంపింది. ఈనెల 15 నుంచి 20 వరకు ఫైనల్ పరీక్షలు జరగున్నట్లు సమాచారం. అందుకుగానూ డాక్టర్ ఎ.అరవింద్ ఎక్స్‌టర్నల్ ఎగ్జాబినరగ్‌గా పాల్గొనడంతో పాటు పరీక్షలకు సంబంధించి క్లీనికల్, ల్యాబ్ నిర్వహణ, మూల్యాంకనం నిర్వహించనున్నారు. దేశం తరపున డాక్టర్ అరవింద్‌కుమార్ పాల్గొననున్నారు. రాష్ట్రం నుంచి హెల్త్ అండ్ సైన్స్ యూనివర్శిటీ రువాండాకు వెళ్లడం పట్ల సిద్దిపేట వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు సామాజిక సేవ కార్యక్రమాలు అరవింద్‌కుమార్ నిర్వహిచారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ సౌత్‌ఆఫ్రికాలోని మెడికల్ డెంటిస్ట్ ఫైనల్ పరీక్షల్లో ఎక్స్‌టర్నరల్ ఎగ్జాబినరగ్‌గా అ యూనివర్శిటీ ప్రిన్సిపాల్ అహ్వానం పంపడం సంతోషంగా ఉందన్నారు.

### సిద్దిపేట బిడ్డగా అభినందిస్తున్నా : మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ అరవింద్ సౌత్ ఆఫ్రికాలోని మెడికల్ హెల్త్ సైన్స్ యూనివర్శిటీ అఫ్ రువాండా డెంటిస్ట్ పరీక్షల నిర్వహణకు వెళ్లడం పట్ల మంత్రి తన్నీరు హరీష్‌రావు అనందం వ్యక్తం చేశారు. సిద్దిపేట బిడ్డగా అయనను అభినందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కీర్తి గడించేలా అయన సేవలు మరిన్ని కొనసాగించాలని అకాంక్షించారు.

కుస్తీ పడుతున్న మల్లయోధులు

## హోరా హోరీగా కుస్తీ పోటీలు



ఇరువురు తలపడుతున్న దృశ్యం

**టేక్మాల్, మే 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొడ్మట్‌పల్లిలో గ్రామంలో శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలతో ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీలకు మహారాష్ట్ర, కర్ణాటక, నారాయణఖేడ్, జహిరాబాద్‌లతో పాటు తదితర ప్రాంతాల నుండి మల్లయోదులు కుస్తీలు పట్టేందుకు గాను వచ్చారు. 11 కుస్తీలు ఏర్పాటు చేశారు. మొదటి కుస్తీ 5 కొబ్బరి కాయలతో మొదలైంది. ఆఖరు కుస్తీ ఐదు తులాల వెండి కడెం వరకు కుస్తీలు పట్టారు. చివరి కుస్తీదారు మహారాష్ట్ర ప్రాంతంలోని ఉద్గీర్ గ్రామానికి చెందిన అభిజిత్ అనే వ్యక్తి గెలుపొందాడు. ఈయనకు పది తులాల కడెంను బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన బేగరి మొగులయ్య చేతుల మీదుగా అందజేశారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మెన్ బస్వరాజ్ పాటిల్, గ్రామ సర్పంచ్ స్వరూప దశరత్‌లతో పాటు ఎలాంటి అవంఛనీయ సంఘటనలు జరగకుండా ఎయస్ఐ దయనంద్, కానిస్టేబుల్ పోచయ్యలున్నారు.

## నాగారం రేషన్ డీలర్ సస్పెండ్...!?

**హుస్నాబాద్, మే10, ప్రభాతవార్త:** హుస్నాబాద్ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బత్తుల పద్మను సస్పెండ్ చేస్తూ శిక్షణ పాలనాధికారి, హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి ఫైజాన్ అహ్మద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. ఈ నేపథ్యంలో నాగారం గ్రామ విఆర్ఎ భవానీ ద్వార ఆదేశాలు జారీ చేసినప్పటికీ పద్మ ఆ ఆదేశాలను స్వీకరించలేదని తెలుస్తోంది.

## పదిలో అల్లాదుర్గం మండల టాపర్‌గా శ్రీనివాస్

**అల్లాదుర్గం, మే10 ప్రభాతవార్త:** అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టి. శ్రీనివాస్ పదవ తరగతి ఫలితాల్లో 10/10 జీపీపీ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. అల్లాదుర్గం మండలంలో 238 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 231 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో ముస్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన శ్రీనివాస్ 10/10 జీపీఏ సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. మండలంలో 97.6 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి బుచ్చానాయక్ తెలిపారు. ముస్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నుండి 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని, గడిపెద్దాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుండి 34 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. అల్లాదుర్గం కేజీబీవీ పాఠశాల నుండి 42 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రావగా 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అలాగే అల్లాదుర్గం బాలికల పాఠశాల నుండి 43 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని, బాలుర పాఠశాల నుండి 19 విద్యార్థులు పరీక్షలు రాయగా 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. జెడ్పీహెచ్‌ఎస్ సిల్వర్ పాఠశాల నుండి 35 మంది విద్యార్థులు పరీఓలు రాయగా 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. మొత్తానికి మండలం నుండి ముస్లాపూర్, అల్లాదుర్గం బాలికల, గడిపెద్దాపూర్ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి తెలిపారు.

## ఘనంగా పల్లకి సేవ

**కొల్చారం, మే10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి అశేష జనవాహిని మధ్య గ్రామంలోని గిరి ప్రదిక్షణలో మాడ వీధుల గుండా స్వామి పల్లకి సేవ నిర్వహించారు. ముందుగా పవిత్ర మంజీరా నది నుండి గంగాజలంతో వెంకటాద్రికి గోవింద నామస్మరణలతో బయలుదేరి తీసుకొచ్చి వెంకటేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించారు. భక్తులు సంగమేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నవాజ్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రాజు, పాశం శ్రీనివాస్‌గౌడ్, బాలకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## 'పది'లో 93 శాతం ఉత్తీర్ణత

**చిన్నశంకరంపేట, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన చిన్నశంకరంపేట మండల పరిధిలోని మిర్జాపల్లి, సూరారం, చందం పేట, శాలిపేట, ధర్పల్లి, మడూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చిన్నశంకరంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 112 మందికి 108 మంది విద్యార్థులు, కేజీబీవీలో 36 మందికి గాను 35 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా 550 మంది పరీక్షలు వ్రాయగా 445 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 98 శాతం నమోదైంది. ఆదర్శ పాఠశాలకు చెందిన అక్షయ, జస్వంత్, సాయికిరణ్‌లు 9.8 జీపీఏ సాధించి మొదటి ర్యాంకు సాధించారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు : ఎంఇవో

**నర్సాపూర్, మే 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఎంఈఓ బుచ్యానాయక్ అన్నారు. బుధవారం పదవ తరగతి పరీక్షా ఫలితాలు వెలువడగా ఇందులో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. నర్సాపూర్ మండలంలోని తెలంగాణ మాడల్ స్కూల్ విద్యార్థులు 9.8 జిపిని సాధించారు. బి.భవాని 9.8 జిపి, శివ నాగిని 9.7 జిపి, మహ్మద్ పాషా 9.7 జిపిని సాధించారని తెలిపారు. అంతేగాక ఎంజెపిటి బిసి పాఠశాలలో 99 శాతం, మైనార్టీ పాఠశాలలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ తెలిపారు.

**గిరిజన గురుకుల పాఠశాలలో...**

నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో పది పరీక్షా ఫలితాల్లో 89 శాతం ఉత్తీర్ణత సాధించారని రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్ బిక్షమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో మొత్తం 71 మంది విద్యార్థులు పదవతరగతి పరీక్షలు రాయగా 63 మంది ఉత్తీర్ణులయ్యారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారితోపాటు వైస్ ప్రిన్సిపాల్ చార్లెస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

### పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

**నంగునూర్/కొండపాక, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. నంగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందకు వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ఏడుగురు విద్యార్థులు 10 జీపీఏలు సాధించారు. అంకాపూర్‌లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ముగ్గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. అలాగే రాజగోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందకు వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఒకరూ 10 జీపీఏ సాధించారు. నర్మేట, మగ్దంపూర్, బద్దిపడగ, గట్లమల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాల మాకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి ఫెయిలయ్యాడు. టిఎస్ఎంఎస్ అక్కనపల్లి పాఠశాలలో వందకు వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీపీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. నంగునూర్ మండలంలో 387 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 386 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో దేశిరెడ్డి తెలిపారు.

**కొండపాకలో...**

ఉమ్మడి కొండపాక మండలంలో బుధవారం వెల్లడించిన పదో తరగతి ఫలితాలలో 16 ప్రభుత్వ పాఠశాలల్లో 565 మంది విద్యార్థులకు గానూ 565 మంది విద్యార్థులు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అలాగే కుకునూర్‌పల్లి పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు అఖిల, అంజనలు 10 జీపీఏ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన 10 జీపీఏ పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు.

### బిజెవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా జేరిపోతుల శ్రీనివాస్



జేరిపోతుల శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు సురేష్

**హుస్నాబాద్, మే 10, ప్రభాతవార్త :** బిజెవైఎం హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్‌గా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల శ్రీనివాస్‌ను జిల్లా అధ్యక్షుడు బొంగొని సురేష్‌గౌడ్ నియమించారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అ ందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, హన్మకొండ అధ్యక్షురాలు పద్మతో పాటు బిజెవైఎం జిల్లా అధ్యక్షులు సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిపి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి మానససుభాష్

**హుస్నాబాద్, మే 10, ప్రభాతవార్త :** కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి లకావత్ మానససుభాష్ అన్నారు. బుధవారం మండలంలోని వంగరామయ్యపల్లి గ్రామంలో సర్పంచ్ వంగ విజయలక్ష్మివెంకటరామిరెడ్డి, మార్కెట్ చైర్మెన్ ఎడబోయిన రజినితిరుపతి రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలో మక్కలు, ధాన్యాన్ని అమ్మి మద్దతుధర పొందాలని, దళారులనుకు అమ్మి నష్టపోవద్దని సూచించారు.

### వికలాంగులకు బస్ పాస్ మేళా

**మిరుదొడ్డి, మే 10, ప్రభాతవార్త :** దుబ్బాక డిపో పరిధిలో గల వికలాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించడం జరుగుతుందని డిపో అధికారులు తెలిపారు. చిన్నారు లేదా 20 మంది అంతకంటే ఎక్కువగా వికలాంగులు ఉంటే వారు ఉంటున్న ప్రాంతానికి గానీ గ్రామానికి వచ్చి ఈ బస్ పాస్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. సిద్దిపేట, దుబ్బాకలో ఉన్న వారు కొత్త బస్టాండ్లలో బస్సుపాస్‌లు పొందవచ్చునని తెలిపారు. బస్‌పొందడానికి వచ్చే వారు సదరం సర్టిఫికెట్, అధార్ జిరాక్స్, ఒక పాస్ ఫొటో తీసుకొని రావాలన్నారు. పూర్తి వివరాలకు 9959226271కు ఫోన్ చేసి డిపో మేనేజర్‌ను సం ప్రదించాలన్నారు.

### వివోఏలకు కనీస వేతనం చెల్లించాలి

**మిరుదొడ్డి, మే 10, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతంలో పని చేస్తున్న వివోఏలకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, మండల అధ్యక్షులు యమునా అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల సమైక్య కార్యాలయంలో ఎపీఎం కృష్ణారెడ్డికి సమ్మె పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న వివోఏలకు ప్రమాద బీమా రూ.10 లక్షలతో పాటు ఉచిత వైద్యం అందించాలన్నారు. సెర్ప్ నుంచి వివోఏలకు ఐడి కార్డులు అందించాలన్నారు. కార ్యక్రమంలో జమున, వెంకటలక్ష్మీ, స్వప్న, మంగమ్మ, శ్యామల, లావణ్య, నసీరుద్దీన్, భూపాల్, మహేష్, లక్ష్మీ, రాణి, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

# పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

**మెదక్ అర్బన్, మే 10 ప్రభాతవార్త:** అనారోగ్యాల బారినపడిన పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తున్నామని ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మెదక్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు రూ.8,11,500 విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు అనారోగ్యాల బారిన పడి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది సరైన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పేదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ఆర్‌కె.శ్రీనివాస్, నర్స లక్ష్మీనారాయణగౌడ్, విశ్వం, కోఆప్షన్‌సభ్యులు సయ్యద్ ఉమర్, మక్తాభూపతిపూర్ సర్పంచి సుంకరి నర్సింలు, నాయకులు రాగి అశోక్, లింగారెడ్డి, సాంబశివరావు, మోచి కిషన్, వెంకట్, బానీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**సాఫ్ట్ బాల్ క్రీడాకారిణికి ఆర్థిక సహాయం**

శంకరంపేట(ఆర్) మండలం ఖాజాపూర్ తండా పేద గిరిజన కుటుంబమైన భాస్కర్, రాజేశ్వరిల కుమార్తె డి.కార్తీక ఇటీవల అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ అండర్–15 పోటీలకు రాష్ట్రం నుండి ఎంపికైంది. చైనాలో జరిగే అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్‌న పోటీలకు హాజరు కావడానికి ఎక్కువ మొత్తంలో డబ్బులు అవసరం ఉన్న దృష్ట్యా గ్రామస్థులతో కలిసి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కలవడం జరిగింది. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విద్యార్థిని కార్తీకను అభినందించి చైనాకు వెళ్లి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి అవసరమైన మొత్తం సహాయాన్ని అందజేస్తానని ప్రకటించారు. ఇందుకుగాను వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి రూ.1,10,000, వ్యక్తిగతంగా రూ.50,000 అందజేశారు. మొత్తం రూ. 1,60,000 బుధవారం విద్యార్థిని కార్తీకకు, కుటుంబ సభ్యులకు అందజేశారు. సాయం కోసం వచ్చిన వెంటనే స్పందించి కూతురు భవిష్యత్తుకు బంగారు బాటలువేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



డైనింగ్ హాల్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి

**బాలికల ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన**

మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మన బస్తి మన బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డైనింగ్ హాల్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రాల్, కౌన్సిలర్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు రాగి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దచింతకుంటలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంబిస్తున్న మదన్‌రెడ్డి

### అంధత్వ నివారణకే కంటివెలుగు : ఎమ్మెల్యే

**నర్సాపూర్, మే 10.ప్రభాతవార్త:** అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దచింతకుంట గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలను నివారించేందుకుగాను ఈ కంటి వెలుగు కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమానికి మంచి స్పందన లబిస్తుందని ఇప్పటికే 90 శాతం వరకు పూర్తయ్యిందని తెలిపారు. ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మదనరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకట్ నర్సింగరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ గుండెశివకుమార్, నాయకులు పంబళ్ళ బిక్షపతి ,కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పేదింటి ఆడబిడ్డ వివాహానికి పుస్తెలు, మెట్టెలు అందజేత

**కొల్చారం, మే 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామానికి చెందిన సునీత, నర్స నాయక్ దంపతుల కుమార్తె అనిత వివాహానికి బీజేపీ రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి బుధవారం పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇంచార్జి సిద్ధిరాంరెడ్డి, బూత్ అధ్యక్షులు జనార్దన్ గౌడ్, సత్యనారాయణ, ఒగ్గు మహేష్ యాదవ్, అందోల్ రాములు యాదవ్, గ్రామ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ ఫలితాల్లో 89 శాతం ఉత్తీర్ణత

**కొల్చారం, మే 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మంగళవారం వెలువడిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 89 శాతం ఉత్తీర్ణత సాధించింది. కళాశాల నుండి మొత్తం 116 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 104 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరైన 130 మంది విద్యార్థుల్లో 63 మంది (48 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

### నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి

**కొల్చారం, మే 10 ప్రభాతవార్త:** ఈ నెల 11న సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్ కోరారు. బుధవారం పోతంశెట్టిపల్లి చౌరస్తాలోని హనుమమ్మ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి నిరుద్యోగులను నట్టేట ముంచిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పులుపునిచ్చారు. పరీక్షల పేరుతో లీకేజీలు చేపడుతూ నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సంగారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌లో అధిక సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, నిరుద్యోగులు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ఉపాధ్యక్షులు జంగంగారి శ్రీకాంత్‌గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు బసన్నగారి నాగరాజుగౌడ్, మైనారిటీ మోర్చా అధ్యక్షులు ఖలీల్, కిష్టాపూర్ శక్తి కేంద్రం ఇంచార్జి వడ్ల చంద్రశేఖర్, కొంగోడ్ గ్రామ బూత్ అధ్యక్షులు వంజరి ఏగొండ, నాయిని జలాల్‌పూర్ గ్రామ బూత్ అధ్యక్షులు కీసరి భూమాగౌడ్, రాంపూర్ బూత్ అధ్యక్షులు డాకం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షులు దయాకర్‌గౌడ్



మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మిరెడ్డి

### 15న మండల స్థాయి క్రీడా పోటీలు

**చిన్నశంకరంపేట, మే 10, ప్రభాతవార్త:** మండలస్థాయి క్రీడాపోటీలను ఈ నెల 15,17వ తేదీవరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేటలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెట్స్ ఆటలు ఆడే క్రీడాకారులు తమ వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న జట్లను పంచాయతీ కార్యదర్శి ఎంపిక చేసి మండల స్థాయికి పంపడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లను జిల్లా స్థాయిలో ఆడటానికి పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. ఎంపీవో గిరిధర్‌రెడ్డి, ఎస్ఐ పోచయ్య, వివిధ ప్రభుత్వ పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నేతలపై విమర్శలు మానుకోవాలి

**గజ్వేల్, మే 10 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ నాయకులపై మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేస్తున్న వ్యాఖ్యలు సరైనవి కావని గజ్వేల్ మండల మైనార్టీ అధ్యక్షుడు అజ్గర్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై విమర్శలు చేయడం పద్ధతి కాదన్నారు. మంత్రి హోదాలో ఉండి కాంగ్రెస్ పార్టీ నేతలను వాడు వీడు అని మాట్లాడడం ఎంత వరకు సమంజసమన్నారు. మంత్రి పదవి కోసం ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లడం అతని నైజం అన్నారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోరాటం చేస్తే వారికి అండగా నిలిచిన కాంగ్రెస్ నేతలను విమర్శించడం భావ్యం కాదన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ పతనం ఖాయమని హెచ్చరించారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిపి

**మర్కుక్, మే 10 (ప్రభాతవార్త):** ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రంలు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని దామరకుంట, మర్కుక్ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రంలు మాట్లాడుతూ మద్దతు ధర కల్పిస్తూ రైతులకు అందుబాటులో ఉండేందుకే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 15 రోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని సూచించారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని గుర్తుచేశారు. ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయించి రైతులు మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్య, మర్కుక్ సర్పంచ్ భాస్కర్, పిఎసిఎస్ చైర్మన్ అంజిరెడ్డి, వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, ఎంపిటిసి చైతన్యశంకర్‌రెడ్డి, ఏఓ నాగేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ అంజయ్య, ఏఈఓలు రజినికాంత్, అశ్విని పాల్గొన్నారు.



దామరకుంటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

# ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

**చిన్నశంకరంపేట, మే 10, ప్రభాతవార్త:** పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేయడం జరిగిందని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన 48 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్, సీఎం సహయనిధి చెక్కులను అందించారు. అలాగే చందాపూర్ గ్రామానికి చెందిన వికలాంగుడు లింగంకు ట్రై సైకిల్‌ను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆపద సమయంలో ఆదుకునే ముఖ్యమంత్రి సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి దేశాన్ని తెలంగాణ వైపుకు చూసేలా చేశారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న సంక్షేమ పథకాలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. డీజిల్, పెట్రోల్, ధరలను పెంచి సామాన్యుని నడ్డీ విరుస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కళ్యాణలక్ష్మీ పథకంతో బాల్య వివాహాలు తగ్గాయని, సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. పేదలకు భారాస ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భారాస పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, తహసీల్దార్ మహేందర్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పూలపల్లి యాదగిరి యాదవ్, మాజీ సర్పంచి కుమార్‌గౌడ్ మండలం లోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న కడారి నాగరాజు

### ధాన్యం కొనడంలో అధికారుల నిర్లక్ష్యం

**సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు**

**నర్సాపూర్, మే 10, ప్రభాతవార్త:** ధాన్యం కొనడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో వరి పంట ఎంత పండిందో అంచనా వేయకుండా కేవలం 436 డిసిఎంఎస్, ఐకెపి, సొసైటీ కేంద్రాలుగా ఏర్పాటు చేసి కేవలం 33 రైస్ మిల్లులకే అనుమతులనివ్వడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఈ రైస్ మిల్లుకు వెళ్లిన లారీలు రాక కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం వెళ్లకపోగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద టాపర్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. జిల్లా అధికారులు కేంద్రాలను సందర్శించినా రైతులకు ఎటువంటి ఉపయోగం లేదని అన్‌లోడింగ్ వెంటనే చేయాలని, లారీలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

### సిఎం కెసిఆర్ రైతు పక్షపాతి : దేవి రవీందర్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దేవి రవీందర్

**కొండపాక, మే 10, ప్రభాతవార్త :** రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్ అన్నారు. కుకునూర్‌పల్లి మండల పరిధిలోని మాతుపల్లి గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ బచ్చలి మహిపాల్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతుల వాకిట్లోకి కొనుగోలు సెంటర్లను గ్రామాల్లో ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిఎం కెసిఆర్ రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల శ్రీనివాస్, అత్మకమిటీ డైరెక్టర్ పాల శంకర్, బిఆర్ఎస్ నాయకులు కోల రవీందర్, ఇరసాల కర్ణాకర్, కృష్ణగౌడ్, చరణ్, కొంతం రాజు, నర్సింలుగౌడ్, కృష్ణారెడ్డి, లింగం, మసూద్, క్రిష్ణ, సుధాకర్, ఎపిఎం శ్రీనివాస్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ**

**చిన్నకోడూరు, మే 10, ప్రభాతవార్త:** దేశంలో పురాతనం నుంచి హోమియోపతి అయుర్వేదిక్ ముందుకు తీసుకొచ్చారని మనం అందరం భావితరాలకు అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని రాముని పట్ల గ్రామంలో లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో అద్వైత అయుర్వేదిక్ హోమియోపతి ఆసుపత్రి సహకారంతో ఉచిత అరోగ్య మెగా హెల్త్ క్యాంపు నిర్వహించగా ఆమె ఎంపిపి కూర మాణిక్యారెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హోమియోపతి మందులతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ప్రజలు అరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అరోగ్యానికి పెద్ద పీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎల్లయ్య, ఎంపిటిసి జ్యోతిచంద్రం, ఉప సర్పంచ్ కుమార్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలి



ప్యాడి క్లీనర్లు, వేయింగ్ మిషన్లు అందిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, మే 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏలాంటి ఇబ్బందులు రాకుండా మంత్రి హరీష్‌రావు సహకారంతో అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఏపిఎం మహిపాల్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దకోడూరు, అల్లీపూర్, మైలారం, మాచాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు 4 ప్యాడి క్లీనర్లు, 3 వేయింగ్ మిషన్లు మంత్రి హరీష్‌రావు అదేశాల మేరకు బుధవారం పంపిణీ చేసినట్లు అయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మి మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో సీసీ శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయండి

**వర్గల్, మే 10 (ప్రభాతవార్త):** సంగారెడ్డిలో ఈనెల 11న నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌ను నిరుద్యోగులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని బిజెపి రాష్ట్ర నాయకుడు, వర్గల్ ఇన్‌ఛార్జి పూదరి నందన్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం వర్గల్ మండలం నాచారంలో నిరుద్యోగ మార్చ్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగం కల్పిస్తామని మాట ఇచ్చి ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు ఎల్లు రాంరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కుడిక్యాల రాములు, కో–కన్వీనర్లు మహేష్, సురేష్, నాయకులు మహేష్, పంపరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నందన్‌గౌడ్

### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**అక్కన్నపేట, మే 10, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడిన సంఘటన అక్కన్నపేట మండలం కుందనవానిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కుందనవానిపల్లి గ్రామానికి పెట్రోలింగ్‌కై వెళుతున్న హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణ, కానిస్టేబుల్ యాదగిరిలకు కన్నముల కొమురయ్య కుటుంబ కలహాలతో మనస్థాపానికిగురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. ఈ విషయం హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణ, కానిస్టేబుల్ యాదగిరి తెలుసుకుని అంబులెన్స్ గ్రామానికి చేరుకోవడం ఆలస్యం అవుతుందని గ్రహించి వెంటనే పోలీస్ వాహనంలో కొమురయ్యను తీసుకుని హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. దీంతో పోలీసులను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

**మునిపల్లి, మే 10, ప్రభాతవార్త:** ఇంటర్ ఫలితాల్లో మోడల్ స్కూల్ కాలేజ్‌లో చదువుతున్న మొదటి ద్వితీయ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి మోడల్ కాలేజ్ సత్తా ఏంటో చూపించారని స్కూల్, కాలేజ్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిపి విభాగంలో మండలంలోని మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన బండారి ఉమా (శైలు) 425 మార్కులు, బిపిసిలో పంరగారి తేజస్విని 409 మార్కులు సీఈసీ విభాగంలో మునిషా 451 మార్కులు సాధించారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి విభాగంలో చెన్నారెడ్డి నికిత 947, బైపిసి విభాగంలో బోయిని శృతి 957 మార్కులు, సీఈసీ విభాగంలో తలారి ఐశ్వర్య 818, ఎంబీసీలో గడీల అంజలి 800 మార్కులతో పాటు సాధించి కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఫలితాలు సాధించామని ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## గూడూరులో ఘనంగా బొంగుండేశ్వర ఉత్సవాలు



గూడూరులో బొంగుండేశ్వర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

**నాగల్‌గిద్ద, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని గూడూరు గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బొంగుండేశ్వర ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా చేరుకుని బొంగుండేశ్వరిడికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్‌రెడ్డి, కుర్మసంఘం నారాయణఖేడ్ నియోజకవర్గ నాయకులు అంజన్న, కాలి రాజు, విఠల్, వెంకట్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగి వృద్ధురాలి మృతి

**పాపన్నపేట, మే 10, ప్రభాతవార్త:** బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదావశాస్తు నీట మునిగి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని మిన్‌పూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...గ్రామానికి చెందిన జంగం మల్లమ్మ మంగళవారం వేకువ జామున గ్రామ శివారులోని దుబ్బ చెరువుల బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదావశాస్తు చెరువులో మునిగి మృతి చెందిందన్నారు. మృతురాలి కుమారుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ నారాయణ్ తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**మనూర్, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని ఎన్‌జి హుక్రానా గ్రామంలో బుధవారం గ్రామ ఉప సర్పంచ్ గోపాల్ సోదరుడి కుమార్తె వివాహానికి ఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. బిఆర్ఎస్ నాయకులు నాగేందర్, సర్పంచ్‌లు నర్సింలు, శివాజీరావు, నారాయణఖేడ్ బిఆర్ఎస్ అధ్యక్షులు తుర్కపల్లి అంజుఉగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 16న జాబ్ మేళా

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 10, ప్రభాతవార్త:** జిల్లా ఉపాధిశాఖ ఆధ్వర్యంలో ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫినో పేమెంట్స్ బ్యాంక్ కంపెనీలో 3 ఉద్యోగాల భర్తీకి మే 16న ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలని, ఏదేని డిగ్రీ విద్యార్థతలు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. జీతం రూ.18 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 16న నిర్ణీత సమయంలోగా తమ విద్యార్థతల ధ్రువపత్రాలు, ఎస్ఎస్‌సి మెమో, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో నేరుగా జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 08455న271010లో సంప్రదించవచ్చని తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**గుమ్మడిదల, మే 10, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో సుంకం మైసమ్మ మరణించడం జరిగింది. స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తన సోదరుడు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి ద్వారా ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ సర్పంచ్ రేణుక స్వామి, ఎంపిటిసి బుద్దుల పార్వతమ్మ, బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు శివకుమార్, నర్సింగ్‌రావు, రమేష్, సత్తయ్య, యాదగిరి, మల్లేష్, బిక్షపతి, శ్రీకాంత్, అర్జున్, మృతురాలి కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

## ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 10, ప్రభాతవార్త:** జర్మన్నీ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌లు, ప్రాజెక్టు మేనేజ ర్లు, కన్సల్టెంట్లు, ఈఆర్‌పి మరియు ఐటి-సపోర్ట్ తదితర ఉద్యోగాల కోసం అభ్యర్థులు టామ్ కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు సంబంధిత రంగంలో 3 నుండి 5 సంవత్సరాల అనుభవం కలిగి ఉం డాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ విద్యార్థతతో పాటు జర్మన్ భాషలో ప్రావీణ్యత గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి అర్హ త గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## చిన్నారిని ఆశీర్వదిస్తున్న ఎంపి బిబి పాటిల్

**సదాశివపేట, మే 10, ప్రభాతవార్త:** పట్టణంలో బుధవారం వీరశైవ సమాజం చౌకి మఠం సభ్యులు మఠం రాచన్నస్వామి పిల్లల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్ హాజరై చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం రాష్ట్ర నాయకులు అడిగే జగదీశ్వర్, సులుగంటి సిద్దేశ్వర్, సంగారెడ్డి జిల్లా వీరశైవ సమాజం గౌరవ అధ్యక్షులు బాబు పాటిలన, ప్రధాన కార్యదర్శి అనిశెట్టి జయప్రకాష్, నాయకులు వీరన్నపాటిల్, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దుల తెలంగాణ మాత్రమే వచ్చింది

### -సామాజిక తెలంగాణ ఇంకెప్పుడు : కోనాపూర్ బక్కప్ప

**సదాశివపేట, మే 10, ప్రభాతవార్త:** సిద్దిపేటలో జరిగిన సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఏర్పాటు చేసిన సభలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోనాపూర్ బక్కప్ప మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిసిలు అధికారంలోకి వచ్చి అన్ని పదవులు అనుభవించి నిర్ణయ అధికారం బిసిల చేతుల్లోకి రావాలని, అప్పుడే బిసిలకు సరైన అవకాశాలు దక్కుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులాన్ని, స్థాయిని బట్టి రాజకీయాలు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో వార్డు సభ్యుని స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయిలో పోటీకి దించే విధంగా కార్యక్రమాలు నిర్ణయించాలని, రాష్ట్రంలో బిసిలు రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న బహుజన రాజకీయ సమితి జిల్లా అధ్యక్షులు బక్కప్ప

# పది ఫలితాల్లో సత్తా చాటిన సర్కార్ స్కూల్స్

**న్యాల్‌కల్, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో 10లో విద్యను అందుకుని ఇటీవల వార్షిక పరీక్షా ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. మండలంలోని 9 పాఠశాలల్లో 10లో విద్యను అందుకున్న 393 మంది విద్యార్థులు ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలు రాయగా 373 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు ఎంఇఓ మారుతి రాథోడ్ పేర్కొన్నారు. ఎంఈఓ మారుతి రాథోడ్ కథనం ప్రకారం... మండలంలోని మెటల్‌కుంట, చాల్కి, రేజింతల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 100 శాతం మంది ఉత్తీర్ణులయినట్లు పేర్కొన్నారు. హద్నూర్, మిర్జాపూర్(బి), మామిడ్గి జడ్పీహెచ్ఎస్‌లలో 96 శాతం, న్యాల్‌కల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 93 శాతం, న్యాల్‌కల్ జడ్పీహెచ్ఎస్‌లో 90 శాతం, చీకుర్తి జిల్లా పరిషత్‌లో 86 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా మండలంలోని మిర్జాపూర్(బి) జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కె సాయికుమార్, మహ్మద్ అల్తాఫ్‌లు 10జిపిఏ సాధించినట్లు వివరించారు.

### మనూర్ మండలంలో..

**మనూర్, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను అందుకుని పరీక్షలు రాసిని విద్యార్థులందరూ ఉత్తీర్ణులయినట్లు ఎంఈఓ శ్రీనివాస్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సంతోష్‌కుమార్‌లు తెలిపారు. ఎంఈఓ శ్రీనివాస్ కథనం ప్రకారం... మనూర్‌లో 82 మంది, బోరంచలో 32 మంది, రాయిపల్లిలో 16 మంది, శెల్గిరాలో 8 మంది, ఎల్గోయిలో 27 మంది, బెల్లాపూర్‌లో 23 మంది, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 27 మంది విద్యార్థులు 10వార్షిక పరీక్షలు రాయగా విద్యార్థులందరూ ఉత్తీర్ణులయినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మనూర్ పాఠశాలలో పి స్వాతిరెడ్డి, ఎన్ అంకుషరెడ్డి, మహ్మద్ వహీమ్, జె మోహన్, యం శివకుమార్, కె నర్సింహారెడ్డి, టి శిరీష, బోరంచ పాఠశాలలో దినేష్ కార్తిక్, రాయిపల్లి పాఠశాలలో యం దుర్గా భవాని, డి నందిని, శెల్లిర పాఠశాలలో బి మౌనిక, ఎల్గోయి పాఠశాలలో అశ్విని, అక్షయ, బెల్లాపూర్ పాఠశాలలో ఈ దత్తుగౌడ్, కస్తూర్బా పాఠశాలలో కె మధులు 10 జిపిఓలు సాధించినట్లు వివరించారు.

### మోర్గి పాఠశాలలో..

**నాగల్‌గిద్ద, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని మోర్గి గ్రామంలోని మోడల్ కళాశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో విద్యను అందుకుని 96 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా బుధవారం విడుదలైన 10 ఫలితాల్లో పాఠశాలకు చెందిన అందరు విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు కిరణ్‌కుమార్, వీరశెట్టి, ఆదిత్యలు 10 జిపిఏ సాధించినట్లు పేర్కొన్నారు.

### చేర్యాల పాఠశాలలో..

**కంది, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 98.7 వాతం మంది విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తీర్ణులయినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఎంఈఓ కథనం ప్రకారం ...మండలంలో 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా మండల కేంద్రమైన కందిలో 21ర మంది, మామిడిపల్లిలో 34 మంది, కలివేములలో 14 మంది, ఇంద్రకరణ్‌లో 32 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరు విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు పేర్కొన్నారు. ఎద్దుమైలారంలో 32 మందికి 31 మంది, ఓడిఎఫ్‌లో 15 మందికి 14 మంది, చేర్యాలలో 84 మందికి 83 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు వివరించారు. ఆయా పాఠశాలల నుంచి 232 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 229 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు పేర్కొన్నారు. మండలంలోని చేర్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10లో విద్యను అందుకుని పరీక్షలు రాసిన 84 మందిలో 83 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మండలంలోని ఇంద్రకరన్ పాఠశాల విద్యార్థిని లక్ష్మీ 9.8 జిపిఏ సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

### కంగ్టిలో..

**కంగ్టి, మే 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10లో విద్యను అందుకుని పరీక్షలు రాసిన 71మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాలకు చెందిన పట్లోళ్ల యోగిత 10 జిపిఏ సాధించిందన్నారు. టిటిడబ్ల్యుయుఆర్‌జెసి పాఠశాలలో 10వ తరగతిలో విద్యను ఆర్జించి పరీక్షలకు హాజరైన 77 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు 10 జిపిఏ సాధించినట్లు పేర్కొన్నారు. తడ్కల్ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి వ్యాఖ బాలుర వసతి గృహంలో 28 మంది విద్యార్థులు కంగ్టిలో 14 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులయినట్లు పాఠశాలల ప్రిన్సిపాల్‌లు పేర్కొన్నారు.

### పాపన్నపేట మండలంలో..

**పాపన్నపేట, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యను ఆర్జించిన 569 మంది విద్యార్థులు 10 వార్షిక పరీక్షలకు హాజరుకాగా బుధవారం విడుదలైన ఎస్ఎస్‌సి ఫలితాల్లో 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు మండల విద్యాధికారి నీలకంఠం పేర్కొన్నారు. ఆయా పాఠశాలలకు చెందిన 21 మంది అనుత్తీర్ణులయ్యారన్నారు. పాపన్నపేట పాఠశాలలో 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్నులయినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన దివ్య 9.8 జిపిఏ సాధించగా పాపన్నపేట పాఠశాలకు చెందిన ఉజేర్, కుర్తివాడ పాఠశాలకు చెందిన మీనాక్షి, యూసూఫ్‌పేట పాఠశాలకు చెందిన సుస్మిత, గాంధారిపల్లి పాఠశాలకు చెందిన రేణుక, చీకోడ్ పాఠశాల విద్యార్థి దీపికలు 9.7 జిపిఏ సాధించినట్లు ఎంఈఓ వివరించారు.

### పది ఫలితాల్లో సంగారెడ్డి రాష్ట్రంలో మూడో స్థానం

**సంగారెడ్డి బ్యూరో, మే 10, ప్రభాతవార్త :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లాకు మూడవ స్థానం దక్కింది. ఏప్రిల్-2023లో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలు సంచాలకులు, ప్రభుత్వ పరీక్షలు, హైదరాబాద్‌లో బుధవారం విడుదల చేశారు. ఇట్టి ఫలితాలలో సంగారెడ్డి జిల్లా ఉత్తీర్ణతా శాతం 97.29 శాతం కాగా ఫలితాలు బాలురు 96.77 శాతం, బాలికలు 97.82శాతం ఉతీర్థతా శాతం సాధించినట్లు జిల్లా విద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

### గుమ్మడిదలలో..

**గుమ్మడిదల, మే 10, ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్ష ఫలితాలల్లో మండలంలో 10 జీపీఏతో ప్రథమ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొంతపల్లికి చెందిన శెట్టి పల్లి స్నేహశ్రీ 10/10 జీపీఏ సాధించి గుమ్మడిదల మండలంలో మొదటి ర్యాంకులో నిలిచింది. పాఠశాలలో 91 శాతం పాస్ పర్సంటేజ్‌తో మొత్తం 67 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైన్నారు. ఈ ఫలితాల సాధనలో సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులకు, ఎంపిపి, గ్రామ సర్పంచ్, ఎస్ఎంసి ఛైర్మన్, ప్రముఖులు హృదయ పూర్వక కృత జ్ఞతలు తెలియజేశారు. బీద కుటుంబంలో జన్మించి తండ్రి లేనప్పటికీ మంచి కృషితో 10/10 జీపీఏ సాధించిన స్నేహశ్రీకి అభినందనలు తెలుపుతున్నామన్నారు.

### చౌటకూరు మండలంలో..

**సంగారెడ్డి, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను అందుకుని వార్షిక పరీక్షలు రాసిన 197మంది విద్యార్థులకు గాను 196 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో మండలంలో 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ డి అంజయ్య పేర్కొన్నారు. శివంపేట, చౌటకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, సుల్తాన్‌పూర్ ఆశ్రమ పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పుల్కల్ మండలంలో 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 412 మంది విద్యార్థులు 10 పరీక్షలకు హాజరు కాగా 388 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. గొంగులూరు, పెద్దరెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవి పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని డి అంజయ్య పేర్కొన్నారు.

### జహీరాబాద్‌లో..

**జహీరాబాద్, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 10లో విద్యను అందుకుని పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాలు బుధవారం విడుదల అయిన ఫలితాల్లో 97.56 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు మండల విద్యాధికారి బస్వరాజ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను ఆర్జించిన 1117మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1066 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు (94.50 శాతం) పేర్కొన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాల నుంచి 1339 మందివిద్యార్థులకు పరీక్షలు రాయగా 1134 (99.54)మంది విద్యార్థులు ఉత్తీర్ణ సాధించినట్లు వివరించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 2456 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే వారిలో 2400 మంది (97.56 శాతం) ఉత్తీర్ణ సాధించినట్లు ఎంఈ వివరించారు. నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలో 219 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయితే 212 మంది (97.47 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ బస్వరాజ్ వివరించారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్

## వెల్టూర్‌లో బిటి రోడ్డు పనులు ప్రారంభం

**సదాశివపేట, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూర్‌లో బుధవారం 2 కోట్ల 64లక్షల రూపాయలతో బిటి రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంతా చింత ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పనుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారని కొనియాడారు. మండలంలోని నిజాంపూర్ రోడ్డు నుంచి ముబారక్‌పూర్ వరకు గల 6 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే పలు గ్రామాల ప్రజలకు సౌకర్య వంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమానికి హాజరైన చింత ప్రభాకర్‌ను సర్పంచ్ లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మారెడ్డి, ఎంపిపి తొంట యాదమ్మ కిష్టయ్య, ఎంపిడిఓ పూజా, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, సొసైటీ అధికారి విజయకుమార్, వ్యవసాయ అధికారి అనిత, పిఆర్ డిప్యూటీ దీపక్, రైతు బంధు అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ సుదీర్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు ఆహ్మద్, మాధవరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మునిగే నవీన్, సర్పంచ్‌లు దశరత్, యేసయ్య, సంగమేశ్వర్, సలావుద్దీన్, కుందేన రాజు, అశోక్, నల్లోళ్ల కుమార్, కోడూరి రాములు, హను మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డమీద సత్యనారాయణ, కరుణాకర్, చోటుమియా, నబిసాబ్, మహేందర్, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 12న చినిగేపల్లిలో భవాని మాత వగ్రహ ప్రతిష్ఠాపన

### -హాజరుకానున్న జగదీశ్వరిమాత, కాశీనాథ్‌బాబ



చినిగేపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపనకు ముస్తాబైన భవాని మాత ఆలయం దృశ్యం

**న్యాల్‌కల్, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని చినిగేపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 12వ తారీఖున శ్రీ భవాని మాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటి బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో 12న ఉదయం అందంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుని గ్రామంలోని పురువీధుల గుండా భజనలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటామన్నారు. ఆలయంలో వేద బ్రాహ్మణులు మంత్రాలు వల్లిస్తుండగా మహాయోగిని జగదీశ్వరి మాత, సకల మత స్థాపిత సద్గురువు కాశీనాథ్ బాబ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేయనున్నామన్నారు.

## 22న శాంతియుత ర్యాలీ.. కరపత్రం ఆవిష్కరణ

**న్యాల్‌కల్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో దళితులు ఆర్థికంగా స్థిరపడేందుకు ఒక్కో దళిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం 10 లక్షల రూపాయలను అందచేస్తున్నందుకు కృతజ్ఞతగా ఈ నెల 22న జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ప్రభుత్వానికి కృతజ్ఞతగా శాంతియుత ర్యాలీని నిర్వహించనున్నట్లు మండలంలోని కల్బేమల్ గ్రామ సర్పంచ్, ఎంఆర్‌పిఎస్ జహీరాబాద్ తాలుకా ఇంచార్జి మహిపాల్ పేర్కొన్నారు. బుదవారం చలో సంగారెడ్డి కార్యక్రమ కరపత్రాన్ని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఎంఆర్‌పిఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారన్నారు. కార్యక్రమంలో కోర్ కమిటి సభ్యులు బి హన్మంతు మాదిగ, జిల్లా ఇంచార్జి బంజపల్లి అనిల్ కుమార్ మాదిగ, న్యాల్‌కల్, ఝరాసంగం, జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి మండలాల ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు ఎ అనిల్ కుమార్ మాదిగ, యం నర్సింలు మాదిగ, బి యాకోబు మాదిగ, మబ్బు గోపాల్ మాదిగ, నవలగారి ప్రశాంత్ మాదిగలు పాల్గొన్నట్లు జహీరాబాద్ తాలుకా ఇంచార్జి మైపాల్ మాదిగ పేర్కొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

# కారును ఢీకొన్న లారీ

### హెడ్ కానిస్టేబుల్ మృతి.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

**చౌటకూరు, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని సరాఫ్ పల్లి గ్రామ శివారులో బుధవారం తెల్లవారు జాము జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికి అక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలకు గురయినట్లు పుల్కల్ ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం... సబరాబాద్ కమిషనరేట్ బాచుపల్లిలో హెడ్ కానిస్టే బుల్‌గా విధులు నిర్వహిస్తున్న అరవిల్ల నరసింహారావు (55) తన అల్లుడు కొనేకోటి గోవింద్‌రాజుతో కలిసి బాన్సువాడలో పనులు ముగించుకుని హైదరాబాద్‌కు ఐ 20 కారులో (ఏపి 21ఏయు 5602)లో వెళుతున్న క్రమంలో రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ (పిబి 06 ఎజడ్ 1267) కారును ఢీకొంది. ప్రమాదంలో నర్సింహారావు అక్కడికి అక్కడే మృతి చెందగా గోవింద రాజు తీవ్రంగా గాయపడ్డాడన్నారు. గోవిందరా జును చికిత్స కోసం హైద్రాబాద్ తరలించినట్లు, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమి త్తం జోగిపేట ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. లారీ డ్రైవర్ కాశ్మీర్ రాష్ట్రానికి చెందిన రాంనగర్ ఉదంపూర్‌కు చెందిన సాహిల్ కుమార్ (28)గా గుర్తించా మన్నారు.



కారును ఢీకొన్న లారీ దృశ్యం

## రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుపడుతుంది



లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, మే 10, ప్రభాతవార్త:** రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ఏకైక ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మార్కెట్ కమిటి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదారులకు చెక్కులు పంపిణి చేసి మాట్లాడారు. రైతులు పండించిన పంట చివరి ధాన్యం వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుందని, వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. 161 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రమీల గోపాల్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జగన్, సర్పంచ్‌లు గురుమూర్తిగౌడ్, మల్లేశం, శ్రీనాథ్‌రావు, దానయ్య, స్రవంతి శ్రీనివాస్, లింగారెడ్డి, అనురాధ ఏడుకొండలు, కిష్టయ్య, మమత నర్సింలు, మండల రైతు బంధు అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏడుపాయల పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, నాయకులు బాబాగౌడ్, గోపాల్‌రెడ్డి, శంకర్, కిషన్‌రెడ్డి, తహసీల్దార్ మధుసూదన్, ఎంపిడిఓ జగదీశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, మే 10, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురైన పేదల మెరుగైన ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపకరిస్తోందని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కట్ కాలనీకి చెందిన సుల్తాన్ శంకరయ్య కొంత కాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 1 లక్ష రూపాయలను మంజూరు చేయించి బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందచేశారు. ఎల్ఓసిని అందుకున్న శంకరయ్య కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్ఓసిని అందచేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సమ్మెకు మద్దతు పలుకుతున్న టిపిసిసి నేత నరోత్తం దృశ్యం

## కార్యదర్శులకు మద్దతు పలికిన టిపిసిసి నేత

**జహీరాబాద్, మే 10, ప్రభాతవార్త:** జూనియర్ పంచాయితీ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా 13 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా బాధ లేపోవడం విడ్డూరంగా ఉందని టిపిసిసి నేత వై నరోత్తం ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయం ముందు పంచాయితీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు బుధవారం నరోత్తం మద్దతు పలికారు. సమస్యల పరిష్కారానికి కార్యదర్శులతో సంప్రదింపులు చేయకుండా విధుల్లో చేరండి లేకుండా ఉద్యోగాలు తీసేస్తాం అంటూ కార్యదర్శులను హెచ్చరించడం నియంత పాలన కాదా అని ప్రశ్నించారు. కార్యదర్శుల డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరిం చాలని, కార్యదర్శులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్, యూసూఫ్, రాజు నాయక్, బి మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, తంబన్న, అనిఫ్, విఠల్, చెంగల్ జైపాల్, సంగన్న, షాహిద్, రాములు, కార్యదర్శులు నిషా, నరేష్, ఆదిత్య, రజనీకాంత్, సంతోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**సంగారెడ్డి టౌన్, మే 10, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణ శివారులోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్నికనుగొన్నట్లు రూరల్ ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం... పోతిరెడ్డిపల్లిలో గల జనప్రియ హోటల్ వెనుకాల గుర్తు తెలియని వ్యక్తి (35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు) శవం గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతదేహంపై లైనింగ్ చెక్స్ షర్ట్, తెల్లని డ్రాయర్, నలుపురంగు ప్యాంట్, మల్లిపుల్ కలర్ రెండు వరుసల మొలతాడు ధరించి ఉందన్నారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసు పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు, గుర్తు తెలియని శవాన్ని గుర్తిస్తే సంగారెడ్డి రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## 13న ఆత్మీయ సమ్మేళనం జయవంతం చేద్దాం

### బిఆర్ఎస్ నేతలకు ఎమ్మెల్యే పిలుపు



బిఆర్ఎస్ శ్రేణులకు సూచనలు చేస్తున్న మాణిక్‌రావు

**జహీరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ఈ నెల 13న నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలో నిర్వహించ బోయే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని దిగ్వాల్, చింతలఘాట్, కొత్తూర్(డి), వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, కవేలా గ్రామాల పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకులు పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఆత్మీయ సమ్మళనం విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు నర్సింలు యాదవ్, బంటు రామక్రిష్ణ, ముఓయిజ్, సంపత్, రాజశేఖర్, రమేష్ యాదవ్, రంగప్ప, సుభాష్‌రెడ్డి, ఇజ్రాయిల్‌బాబి, మిథున్‌రాజ్, విఠల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రియాజుద్దీన్, కరణ్, సందీప్, వినోద్, దివాకర్, నర్సింలు, శ్రీను తలారి, వేమారెడ్డి, సల్మాన్ రాజ్, శేఖర్, మోహన్, సునీల్, బెన్నీ, రత్నం, యదవ్‌రెడ్డి, ప్రవీణ్, చిన్న నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## 12 నుంచి హద్నూర్‌లో పట్టాభిషేకం ఏర్పాట్లు

**న్యాల్‌కల్, మే 10, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి కోసం ఈ నెల 14న శ్రీ విశ్వానందగిరి మహారాజ్‌కు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్, హద్నూర్ ఆశ్రమ ఉత్సవ కమిటి బాధ్యులు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.